## క్లుప్తంగా

### వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

**వాంకిడి:** మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహంలో మండల వైద్యాధికారి వినయ్ ఉప్రే ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం ఆరోగ్య విద్య, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఎండల తీవ్రత పెరుగుతున్నందున తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి రవిదాస్, హాస్టల్ వార్డెన్ మధుకర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### వాలీబాల్ కిట్ అందజేత



వాలీబాల్ కిట్ అందిస్తున్న పోలీసులు

**పెంచికల్‌పేట్:** మండలంలోని గొంట్లపేట్ గ్రామానికి చెందిన యువకులకు పెంచికల్‌పేట్ ఎస్సై కొమురయ్య ఆదివారం వాలీబాల్ కిట్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చదువుతో పాటు ఆటల్లో రాణించాలని తెలిపారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉంటే సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలన్నారు. ఆయన వెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.

### మహాసభకు తరలిన పద్మశాలీలు



తరలివెళ్తున్న నాయకులు

**ఆసిఫాబాద్‌అర్బన్:** హైదరాబాద్‌లోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఆదివారం నిర్వహించిన 17వ అఖిల భారత పద్మశాలీల మహాసభకు ఆదివారం జిల్లా కేంద్రం నుంచి పద్మశాలిలు ప్రత్యేక వాహనాల్లో తరలివెళ్లారు. అఖిల భారత పద్మశాలి సంఘం అధ్యక్షుడు కందగట్ల స్వామి ఆధ్వర్యంలో చేపట్టే ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి హాజరైనట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు ఇరుకుల అంజనేయులు తెలిపారు. మహాసభకు తరలివెళ్లిన వారిలో కనకయ్య, శంకర్, శ్రీకాంత్, లింగయ్య, రమేశ్, చందు, మంగ, సునీత, తదితరులు ఉన్నారు.

### ఓపెన్ బాడీ బిల్డింగ్, ఫిజిక్ స్పోర్ట్ చాంపియన్ పోటీలకు ఎంపిక

**ఆసిఫాబాద్‌అర్బన్:** మంచిర్యాల జిల్లాలోని నస్పూర్‌లో ఆదివారం రాత్రి జరిగే ఓపెన్ బాడీ బిల్డింగ్, ఫిజిక్ స్పోర్ట్ ఛాంపియన్ షిప్ పోటీలకు జిల్లా కేంద్రంలోని విశాల్స్ న్యూలుక్ జిమ్‌లో శిక్షణ పొందుతున్న ఆరుగురిని ఎంపిక చేయడం జరిగిందని జిమ్ నిర్వాహకులు ఖాండ్రె విశాల్ తెలిపారు. జిమ్ చేయడం ద్వారా బాడీ షేపింగ్‌తో పాటు మజిల్ బిల్డింగ్, ఎత్తు, వయస్సుకు తగ్గ బరువు, బెల్లీ ఫ్యాట్, పొట్ట తగ్గడం వంటి ప్రయోజనాలు ఉన్నాయన్నారు.

### భారతీయ ఆదివాసీ పర్ధాన్ ఉద్దన్ సంఘటన్ రాష్ట్ర అధ్యక్షుడిగా నగేశ్



మాట్లాడుతున్న దుర్వ నగేశ్

**ఆదిలాబాద్‌రూరల్:** భారతీయ ఆదివాసీ పర్ధాన్ ఉద్దన్ సంఘటన్ రాష్ట్ర అధ్యక్షుడిగా జిల్లాకు చెందిన దుర్వ నగేశ్ నియమితులయ్యారు. ఆదివారం హైదరాబాద్ నగరంలోని మాసబ్ ట్యాంకులో గల ట్రైబల్ వెల్ఫేర్ కమిషనర్ కాన్ఫరెన్స్ హాల్‌లో 11 రాష్ట్రాలకు చెందిన నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సంఘటన్ జాతీయ అధ్యక్షుడు కేపీ ప్రధాన్, కోచాడే నారాయణ, మెస్రం ప్రకాష్, కోవా ప్రభాకర్, గోడం విఠల్, గోడం లక్ష్మణ్, సిడాం రాంకిషన్, వనిత, మెస్రం గిరిజా పాల్గొన్నారు.

### నేడు సావిత్రిబాయి పూలే వర్ధంతి

**ఆదిలాబాద్‌రూరల్:** భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే 128వ వర్ధంతిని సోమవారం నిర్వహిస్తున్నట్లు అఖిల భారతీయ మాలి మహా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పెట్కులే తెలిపారు. జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ కార్యాలయ ఆవరణలో ఉదయం 8గంటలకు మహాత్మా జ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలే దంపతుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించడం జరుగుతుందన్నారు. సాయంత్రం 7 గంటలకు పూలే గెస్ట్‌హౌస్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు.

# ఎండుతున్న మొక్కలు..!



ఎల్కపల్లిలో నర్సరీలో ఏర్పాటు చేసిన షెడ్‌నెట్

- నర్సరీల్లో ఏర్పాటు చేస్తున్న గ్రీన్‌నెట్‌లు
- సవాలుగా మొక్కల సంరక్షణ

**పెంచికల్‌పేట్:** హరితహారం కార్యక్రమంలో భాగంగా గ్రామపంచాయతీల్లో ఏర్పాటు చేసిన నర్సీల్లో మొక్కలు ఎండల తీవ్రతకు దెబ్బతింటున్నాయి. ఎండలు మండిపోతుండటంతో అధికారులు మొక్కల రక్షణకు అనేక పాట్లను పడుతున్నారు. ఎండల నుంచి మొక్కలను రక్షించేందుకు షెడ్ నెట్‌లను ఏర్పాటు చేస్తున్నారు. రోజు రోజుకి ఎండలు మండిపోతుండటంతో మొక్కల రక్షణ అధికారులకు సవాలుగా మారింది. పదో విడత హరిత హారం కార్యక్రమంలో మండలంలోని ఆయా పంచాయతీల్లో లక్ష 45వేల మొక్కలను నాటేందుకు అధికారులు 12 పంచాయతీల్లో నర్సరీలను ఏర్పాటు చేశారు.

**సవాలుగా మొక్కల పెంపకం..**

గత వారం రోజులుగా సుమారు 32 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. దీంతో నర్సరీల్లోల మొక్కల పెంపకం, రక్షణకు ఉపాధిహామీ సిబ్బంది, అధికారులు, వన సేవకులు అనేక ఇబ్బంది పడుతున్నారు. మొక్కల పెంపకంపైన క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ సిబ్బందికి సూచనలు చేస్తున్నారు. అధికారుల ఆదేశాలతో పంచాయతీ కార్యదర్శులు నర్సరీల్లో ఉన్న మొక్కలను సంరక్షించేందుకు షెడ్ నెట్‌లను ఏర్పాటు చేశారు. నర్సీలకు ఉదయం, సాయంత్రం నీటిని అందిస్తూ రక్షణ చర్యలను చేపడుతున్నారు. మరో రెండు నెలలు నర్సరీల్లో ఉన్న మొక్కలను సంరక్షించడం అధికారులకు సవాలుగా మారింది.

**వివిధ రకాల మొక్కలు..**

గ్రామాల్లోని ఖాళీ ప్రదేశాలు, రోడ్డుకు ఇరువైపులా, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో మొక్కలను నాటడానికి అనువైన మొక్కలను పెంచుతున్నారు. టేకు, వేప, చింత, వెదురు, మునుగ, మామిడి, జామ, మందార, గులాబీతో పాటు అనేక రకాల పండ్ల మొక్కలను పెంచుతున్నారు.

> **మొక్కల సంరక్షణకు చర్యలు**
>
> ఎండలు మండుతున్న నేపథ్యంలో పంచాయతీల్లో ఏర్పాటు చేసిన నర్సీలను సంరక్షించేందుకు జాగ్రత్తలు తీసుకుంటున్నాము. ఇప్పటికే నర్సరీల్లో షెడ్‌నెట్‌లను సైతం ఏర్పాటు చేశాం. నర్సరీలను సందర్శిస్తూ క్షేత్ర స్థాయిలో పంచాయతీ కార్యదర్శులకు, ఉపాధిహామీ సిబ్బందికి సూచనలు చేస్తున్నాము.
>
> – అల్బర్ట్, ఎంపీడీవో, పెంచికల్‌పేట్

## ఘనంగా పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన



విగ్రహ ప్రతిష్ఠాపన చేస్తున్న భక్తులు

**బెజ్జూర్:** మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన పోచమ్మ ఆలయంలో పోచమ్మ విగ్రహం, పోతరాజుల విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. వేద పండితులు సత్యనారాయణ శాస్త్రి వేదమంత్రోచ్చరణల మధ్య గణపతి పూజ, యంత్ర ప్రతిష్ఠాపన, పోచమ్మ విగ్రహం, పోతరాజుల విగ్రహాల ప్రతిష్ఠాపన గావించారు. అనంతరం ఇంద్రనగర్ స్వయంభూ మహంకాళి ఆలయ అర్చకులు దేవర వినోద్ స్వామి ఆధ్వర్యంలో బోనాలు నిర్వహించారు. సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప రమాదేవి దంపతులు అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే పాల్వాయి రాజ్యలక్ష్మి, మాజీ ఎంపీపీ మనోహర్ గౌడ్, కోంద్ర శారద, కొండ్ర జగ్గాగౌడ్, చంద్రశేఖర్, సుగుణ, గురజాల వెంకన్న, లంగారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## క్రీడల్లో గెలుపోటములు సహజం



బహుమతులు ప్రదానం చేస్తున్న నాయకులు

**కౌటాల:** క్రీడల్లో గెలుపోటములు సహజమని డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కుమురం మాంతయ్య అన్నారు. మండలంలోని భాలేపల్లి గ్రామంలో కోనేరు ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ పోటీల్లో గెలుపొందిన కౌటాల జట్టుకు రూ. 30వేలు, రన్నరప్‌గా నిలిచిన భాలేపల్లి జట్టుకు రూ. 20వేలు నగదుతో పాటు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత అన్ని రంగాల్లో రాణించాలని, క్రీడలతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా పోటీలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆదే వసంత్‌రావు, డొంగ్రే మధుకర్, నిరంజన్, వాసుదేవ్, సుభాష్, కాశీనాథ్, తదితరులు పాల్గొన్నారు.

## చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

- ఎమ్మెల్సీ దండే విఠల్



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ఎమ్మెల్సీ

**బెజ్జూర్:** సిర్పూర్ నియోజకవర్గంలోని యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ అన్నారు. ఆదివారం బెజ్జూర్ మండలం చిన్నసిద్ధాపూర్ గ్రామ సమీపంలో బెజ్జూర్ యువత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రికెట్ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గెలుపొందిన బెజ్జూర్ టీంకు మొదటి బహుమతి అందజేశారు. అనంతరం ఆయన ఎమ్మెల్సీ సిర్పూర్ నియోజకవర్గంలోని యువకులు క్రీడలతో పాటు చదువులపై దృష్టి సారించాలని సూచించారు. నియోజకవర్గ పేరును రాష్ట్రంతో పాటు దేశంలో నిలబెట్టాలని ఆకాంక్షించారు. యువకులకు చదువులో, క్రీడల్లో ఏవైనా సమస్యలు ఉంటే ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే ప్రయత్నం చేస్తానని అన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ సిడాం గణపతి, టీపీసీసీ మెంబర్ అర్షద్ హుస్సేన్, ఎస్సై ప్రవీణ్ కుమార్, మాజీ జెడ్పీటీసీ పంద్రం పుష్పలత, రాచకొండ శ్రీవర్ధన్, కొండ్ర జగ్గాగౌడ్, కోడ్ప విశ్వేశ్వర్, పెద్దల సుగుణ, చింతలమానపల్లి జెడ్పీటీసీ దుబ్బుల నాన్నయ్య, సామల రాజన్న, రేణిగుంట్ల పెంటయ్య, పోశయ్య పాల్గొన్నారు.

# ‘పరీక్షా’ కాలం..!



కౌటాల పరీక్ష కేంద్రం వద్ద ఇంటర్ విద్యార్థులు

- కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు
- ఈనెల 21 నుంచి పదో తరగతి పరీక్షలు
- ఆరోగ్యంపై శ్రద్ధ తప్పనిసరి
- తల్లిదండ్రులదే కీలక పాత్ర

**కౌటాల:** పిల్లలకే కాదు.. వారి భవిష్యత్‌పై గంపెడాశలు పెట్టుకున్న తల్లిదండ్రులకూ ఇది ఓ ‘పరీక్షా’ కాలం. ఏడాది పాటు చదివిందంతా పరీక్షల్లో రాస్తేనే విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధిస్తారు. పరీక్షలంటే పిల్లల్లోనే కాదు వారి తల్లిదండ్రుల్లోనూ ఆందోళన ఉంటుంది. నిజానికి ఇలాంటి క్లిష్ట సమయాల్లోనే తల్లిదండ్రులు తమ పిల్లలకు అండగా నిలిచి, ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించాలి. అప్పుడే పిల్లలు ఎలాంటి ఒత్తిళ్లకు లోనుకాకుండా విజయవంతంగా పరీక్ష రాస్తారు. దీంతో మంచి మార్కులు సాధరిస్తారని అధికారులు అభిప్రాయపడుతున్నారు. జిల్లాలో ప్రస్తుతం అటు ఇంటర్ వార్షిక పరీక్షలు కొనసాగుతుండగా ఇటు ఈ నెల 22 నుంచి పది వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ నెల 05వ తేదీవ నుంచి మార్చి 20వ తేదీ వరకు జరగనున్నాయి. అలాగే త్వరలో పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో విద్యార్థులు పలు జాగ్రత్తలు పాటించాలని అధికారులు సూచిస్తున్నారు. విద్యార్థుల మానసిక ఒత్తిడిని దూరం చేసేందుకు ప్రభుత్వం టెలీ మానస్ 14416 టోల్‌ఫ్రీ నంబర్‌ను అందుబాటులోకి తెచ్చింది.

**ఆరోగ్యం కీలకం**

విద్యార్థులు పాఠశాలల్లో గడిపేది రోజుకు ఎనిమిది నుంచి పది గంటలు మాత్రమే. మిగిలిన సమయంలో ఎక్కువగా ఇంట్లోనే ఉంటారు. కాబట్టి, వాళ్ల చదువులో రాణించేందుకు ఇంటి వాతావరణం ఎంతో ముఖ్యం. విద్యార్థులు ఇంటి వద్ద చదివేటపుడు వీలైనంతవరకూ వారిని టీవీ, కంప్యూటర్ వంటి ఉపకరణాలకు, వినోదాలకు దూరంగా ఉంచాలి. వారి ముందు సెల్‌ఫోన్ సంభాషణలు సరికాదు. బాగా రాయాలనే ఆలోచనతో చాలామంది రాత్రంతా నిద్రపోకుండా చదువుతుంటారు. దీంతో తలనొప్పి మొదలై చదివింది కూడా మర్చిపోయే అవకాశం ఉంది. వేళకు పౌష్టికాహారం తీసుకోవడం, నిద్రపోవడం అవసరం. జిల్లాలో 10,054 మంది ఇంటర్ విద్యార్థులుండగా.. 6,421 మంది పదో తరగతి విద్యార్థులున్నారు.

> **నిర్భయంగా పరీక్షలు రాయాలి**
>
> 
>
> విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా నిర్భయంగా పరీక్షలు రాయాలి. పరీక్షల సమయంలో ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ ఉంచాలి. సమయానికి నిద్రపోవడంతో పాటు సెల్‌ఫోన్ల వాడకంకు దూరంగా ఉండాలి. పరీక్షలంటే విద్యార్థులు భయం వీడి శ్రద్ధగా పరీక్షలకు సిద్ధం కావాలి. పరీక్షల విషయంలో ఎలాంటి ఆందోళనలు, సందేహాలు ఉన్న తల్లిదండ్రులకు తెలిపాలి. మానసిక ఒత్తిడి ఉంటే వైద్యులను సంప్రదించాలి.
>
> – నవత, డీడీవో, కౌటాల

**జాగ్రత్తలు పాటించాలి..**

- జవాబు పత్రంలో అన్ని పేజీలు ఉన్నాయో లేదో ముందే చూసుకోవాలి. బార్‌కోడ్, సబ్జెక్టు వివరాలను కూడా సరిచూసుకోవాలి.
- మొబైల్స్, పేజర్లు, కాలిక్యులేటర్ల వంటి ఎలక్ట్రానిక్ పరికరాలు, పేపర్ల పరీక్ష హాల్లోకి అనుమతించరు. ఒక వేళ వాటిని ఎవరికీ తెలియకుండా తీసుకెళ్తే మాల్ ప్రాక్టీస్ కేసు బుక్ చేస్తారు.
- కాపీయింగ్, మాల్‌ప్రాక్టీస్, ఒకరికి బదులు మరోకరు పరీక్ష రాస్తే క్రిమినల్ కేసు నమోదు చేస్తారు.
- పరీక్ష కేంద్రాల వద్ద 114 సెక్షన్ అమల్లో ఉంటుంది. జిరాక్స్ కేంద్రాలు మూసివేస్తారు.

## విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలి



నృత్యం చేస్తున్న విద్యార్థులు

**కౌటాల:** గ్రామీణ ప్రాంత విద్యార్థులు జీవితంలో ఉన్నతంగా ఎదగాలని కరస్పాండెంట్ యాదగిరి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని మయూరి విద్యాలయంలో పది విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. పోటీ ప్రపంచంలో చదువుతోనే బంగారు భవిష్యత్ ఉంటుందన్నారు. పది విద్యార్థులు పరీక్షలంటే భయం వీడాలని తెలిపారు. పదో తరగతి జీవితంలో మొదటి మొట్టు అని తెలిపారు. సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం విద్యార్థులు చేసిన సంస్కృతిక నృత్యం ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సంతోష్, పాల్గొన్నారు.

## పెళ్లి వేడుకల్లో క్రికెట్ మ్యాచ్



పెళ్లిలో క్రికెట్ మ్యాచ్ చూస్తున్న బంధువులు

**కౌటాల:** కౌటాల మండల కేంద్రంలోని జగదాంబ గార్డెన్‌లో జరిగిన తాళ్లపల్లి అక్షయ్‌గౌడ్, సోనిల పెళ్లి వేడుకల్లో ఆదివారం ఆసక్తికర ఘటన చోటు చేసుకుంది. వివాహ వేడుకలో భాగంగా స్క్రీన్‌పై పెళ్లితో పాటు ఛాంపియన్ ట్రోఫీలో భారత్– న్యూజిలాండ్ ఫైనల్ మ్యాచ్‌ను లైవ్ కవరేజ్ ప్లే చేశారు. పెళ్లికి హాజరైవారు క్రికెట్ మ్యాచ్ చూసి ఆనందపడ్డారు.

**దహెగాం:** సాధారణంగా పెళ్లి వేడుకల్లో పెళ్లిలో జరిగే కార్యక్రమాలు లైవ్ చేస్తారు. కాని ఇక్కడ క్రికెట్ ఫైనల్ మ్యాచ్ వేశారు. మండలంలోని ఐనం గ్రామంలోని ఓ పెళ్లి వేడుకల్లో ఇండియా, న్యూజిలాండ్ ఫైనల్ మ్యాచ్‌ను టెలీకాస్ట్ చేశారు. దీంతో పెళ్లికి వచ్చిన బంధువులు పెళ్లిని పక్కన పెట్టి క్రికెట్ మ్యాచ్ చూశారు.

# క్రీడలతో స్నేహభావం



క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న నాయకులు

**ఇంద్రవెల్లి:** గ్రామీణ ప్రాంతంలో క్రీడలు నిర్వహించడం ద్వారా స్నేహభావం ఏర్పడుతుందని ఇంద్రవెల్లి ఏఎంసీ చైర్మన్ ముఖడే ఉత్తం అన్నారు. ఆదివారం మండలంలోని ఏమాయికుంట గ్రామంలో ఈగల్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఏమాయికుంట గ్రామంలో ఈగల్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలో ప్రతిభ కనబరిచిన జట్లకు మొదటి బహుమతి రూ. 1లక్ష, రెండో బహుమతి రూ. 50 వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇంద్రవెల్లి మంచిపేరు తీసుకోరావాలని ఈగల్ యూత్ సభ్యులకు విన్నవించారు. నాయకులు మీర్జా జీలానిబేగ్, జాదవ్ లఖన్, కోరెంగా సుంకట్ రావ్, ఎండీ జునైద్, చింతవార్ దీపక్ పాల్గొన్నారు.

## దివ్యాంగ ఉద్యోగుల సంఘ కార్యాలయం ప్రారంభం

**ఆదిలాబాద్‌టౌన్:** దివ్యాంగ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో తాత్కాలిక నూతన కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రంలోని ఈ కార్యాలయ భవనాన్ని జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమాధికారి మిల్కా ముఖ్య అతి థిగా హాజరై ఆదివారం ప్రారంభించారు. ది వ్యాంగ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంతో పాటు శాశ్వత సంఘ భవన నిర్మాణానికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని భరోసానిచ్చారు. అనంతరం మిల్కాను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో సంఘ బాధ్యులు మహేందర్ రెడ్డి, గంగాదేవి, అలీముద్దీన్, దీపక్ పాల్గొన్నారు.

## ఏఐటీయూసీ రాష్ట్ర సమావేశంలో దేవేందర్




ప్రగతి నివేదికను చదివి వినిపిస్తున్న దేవేందర్

**కైలాస్‌నగర్:** ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం హైదరాబాద్‌లోని హయత్‌నగర్‌లో గల సంఘ భవనంలో జరిగింది. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యూసుఫ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్ పాల్గొన్నారు. ఆదిలాబాద్ జిల్లాలో గతేడాది కాలంలో చేపట్టిన కార్యక్రమాల ప్రగతి నివేదికను ప్రవేశపెట్టారు. అనుబంధ సంఘాలలో పని చేస్తున్న కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇచ్చేలా పోరాటం చేయాల్సిన అవసరముందన్నారు.

## నేడు ప్రజావాణి బహిరంగ విచారణ

**సిరికొండ:** ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు మండలంలో సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా బహిరంగ విచారణ చేపట్టనున్నట్లు ఎంపీడీవో రవీందర్ తెలిపారు. రైతువేదికలో ఉదయం 10 గంటలకు ప్రజలు బహిరంగ విచారణకు హాజరుకావాలని కోరారు.

## ‘దళితుల డిమాండ్లు నెరవేర్చాలి’



మాట్లాడుతున్న కొత్తపల్లి గంగేశ్

**ఉట్నూర్‌రూరల్:** ఏజెన్సీ దళితుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని నేతకాని మహర్ రిజర్వేషన్ పోరాల సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కొత్తపల్లి గంగేశ్ అన్నారు. ఆదివారం ఉట్నూర్ ఐబీ చౌరస్తాలో శాంతియుత ధర్నా పోరాట దీక్ష చేపట్టారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దూల్లె వెంకటేశ్‌తో కలిసి మాట్లాడుతూ ప్రభుత్వ పాలకులు, ఇప్పుడున్న ప్రభుత్వ పాలకులు ఏజెన్సీ దళితులను పట్టించుకున్న పాపాన పోవడం లేదన్నారు. తరతరాలుగా సాగు చేసుకుంటున్న భూములకు, పోడు భూములకు, కట్టుకున్న ఇండ్లస్థలాలకు పట్టాలు లేక సర్వస్వం కోల్పోయి ఏజెన్సీ ప్రజలు దుర్భరజీవితాలు గడుపుతున్నారన్నారు. సంఘ నాయకులు రాజలింగం, మహిళలు పాల్గొన్నారు.

## ‘తక్షణమే పీఆర్‌సీ ప్రకటించాలి’



మాట్లాడుతున్న మూగ శ్రీనివాస్

**ఆదిలాబాద్‌టౌన్:** నూతన పీఆర్‌సీని తక్షణమే ప్రకటించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు మూగ శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా కార్యవర్గ సమావేశాన్ని ఆదివారం జిల్లా కేంద్రంలోని సంఘ భవనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నిరకాల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందించాలన్నారు. ప్రభుత్వం తన మేనిఫెస్టోలో ప్రకటించినట్లుగా సీపీఎస్ విధానాన్ని వెంటనే రద్దుచేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. సర్వీస్ రూల్స్ సాధించి అన్ని రకాల క్యాడర్లలోని ఖాళీలను ప్రమోషన్ల ద్వారా భర్తీ చేయాలని కోరారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని పలువురు మహిళా ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించారు. నాయకులు జాదవ్ అశోక్ కుమార్, బెజ్జంకి రవీంద్ర, దిలేష్ చౌహాన్, పుప్పాల నరేందర్, భానోత్ మనోహర్, రవికుమార్ పాల్గొన్నారు

## ఘనంగా మహిళా దినోత్సవం



మహిళా దినోత్సవంలో పాల్గొన్న మహిళలు

**ఆదిలాబాద్‌రూరల్:** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదిలాబాద్ పట్టణంలోని స్వర్ణకార మహిళలు స్థానిక పార్కులో మహిళా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ త్యాగానికి మారుపేరు మహిళ అని పేర్కొన్నారు. మహిళా దినోత్సవాన్ని జరుపుకోవడం వెనుక కూడా ఎందరో మహిళల త్యాగం ఉందని గుర్తుచేశారు. మహిళా దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. మహిళలు తమ శక్తిని తెలుసుకోని అన్నిరంగాల్లో తమను తాము నిరూపించుకోవాలన్నారు.